andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.9। కనిష్ఠం 29.1
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 13 ఫిబ్రవరి 2024



సాగునీరు అందేనా ?



- జిల్లాలో ముందుకు సాగని 28 ప్యాకేజీ పనులు
- 11 సంవత్సరాల నుంచి 50 శాతం పనులు పూర్తి
- 2013లో ప్రారంభమైన కాళేశ్వరం కాలువ పనులు
- పదకొండేళ్లయినా పూర్తికాలేదని రైతుల ఆవేదన
- నేటికి పూర్తయిన పనులు 48.23 శాతమే

ముథోల్, ఫిబ్రవరి 12 : ప్రారంభించి పదకొండు ఏళ్లు గడుస్తున్నా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తి కావడం లేదు. పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో రైతులకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. అక్కడి నుంచి తెలంగాణలోని ఆయా జిల్లాల్లో బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ఎత్తిపోతల ద్వారా కాలువలకు నీరు అందించే దిశగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జిల్లాలోని ముథోల్ నియోజకవర్గంలోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2013 సంవత్సరంలో ఎత్తిపోతల పనులను (28 ప్యాకేజీ పనులు) చేపట్టి దశాబ్దం గడిచినా పూర్తికాలేదు. సంబంధిత కాలువ పనులు సైతం జరగక నిలిచిపోయాయి. కాలువ పనులు త్వరిత గతిన పూర్తి అయితే మా బీడు భూములు పంట పొలాలతో కళకళలాడుతాయి. మా కష్టాలు గట్టెక్కుతాయన్న గంపెడు ఆశతో ఎదురుచూస్తున్న నేటికీ ఈ కాలువ పనులు పూర్తి కాలేకపోయాయని రైతులు అంటున్నారు. 28 ప్యాకేజీ పనులు పూర్తి కాకపోవడంతో నిరాశనే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే ముథోల్ నియోజకవర్గానికి 28 ప్యాకేజీ కింద గత రాష్ట్ర ప్రభుత్వం రూ.486 కోట్లను కేటాయించింది. ఇప్పటివరకు సుమారు కేవలం రూ. 235 కోట్ల పనులు జరుగగా సుమారు 250 కోట్ల పనులు జరగాల్సిన ఉంది. అయితే ప్రభుత్వం మళ్లీ 2022-2023కు గాను మళ్లీ ప్రభుత్వం 250 కోట్లకు బదులు రూ.316 కోట్లకు పొడిగించింది. అయితే ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని ఉమ్మడి ముథోల్ మండలంతో పాటు తానూర్, కుభీర్, భైంసా మండలంలోని ఆయా గ్రామాల్లోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ఎత్తిపోతల పనులకు చిన్న కాలువలు, పెద్ద కాలువలు తదితర వాటికి సుమారు 3,026 ఎకరాల భూమి అవసరమైతే ఇప్పటివరకు కేవలం 650 మంది రైతుల నుంచి సుమారు 555 ఎకరాల భూమిని సర్వే చేశారు. ఇందులో ఈ పనులకు 457 ఎకరాల 37 గుంటల భూమికి సంబంధించిన 547 మంది భూమి కోల్పోయిన రైతులకు భూ నష్టపరిహారం డబ్బులను గతంలో అధికారులు అందజేశారు. మరో 111 ఎకరాల భూమి కోల్పోయిన 83 మంది రైతులకు నష్టపరిహారం డబ్బు కూడా ఇటీవల కాలంలో అందించారు. సుమారు మరో 400ల ఎకరాల సర్వే పూర్తి అయినప్పటికీ రెవెన్యూ అధికారులు క్లియరెన్స్‌కు పంపినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. 3,026 ఎకరాలకు పైగా భూసర్వే చేసి అందులో భూమి కోల్పోయిన రైతులకు రైతుల వివరాలను సేకరించి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ పనులు ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టు ప్రారంభమైన నుంచి 11 సంవత్సరాలు కావస్తున్న పనులు నడవకపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. సదరు గుత్తేదారు దాదాపు మూడు సంవత్సరాల నుంచి ఈ పనులు జరపడం లేదు. సంబంధిత కాంట్రాక్టర్ తమ వల్ల కాదని చేతులెత్తేశారు. అప్పటి నుంచి ఈ పనులకు బ్రేక్ పడింది.

నత్తే నయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2013లో కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా 28 ప్యాకేజీ ముథోల్ నియోజకవర్గంలో ప్రారంభించారు. దీంతో ఇక్కడి రైతులు తమ భూములకు సాగునీరు అందు తుందని తాము పంటలు సాగు చేసుకోవచ్చని ఎన్నో కలలు కన్నారు. కానీ ఆ కల మాత్రం నేటికీ నెరవేరడం లేదు. కానీ సుమారు 11 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సంబంధిత పనులకు సంబంధించిన చిన్న పెద్ద కాలువల నిర్మాణానికి భూముల సేకరణ పూర్తి కాలేదు. పనులు సైతం నత్తకు నడక నేర్పే విధంగా ఉందని అందని ద్రాక్షగా మిగిలిపోతుందని ఇక్కడి ప్రాంత రైతులు అంటున్నారు. 11 సంవత్సరాలకు కేవలం 48.23 శాతం పనులైతే మిగతా పనులకు ఎన్ని సంవత్సరాలు పడుతుందని ప్రశ్నిస్తున్నారు. మెయిన్ కెనాల్ పనులు తదితర పనులు జరగాల్సింది. కానీ ఇప్పుడు ఆ పనులు జరగడం లేదు. 2013 నుంచి 2015 సంవత్సరం వరకు పూర్తి చేయాల్సి ఉండగా ఈ పనులు పూర్తి కాకపోవడంతో గడువు పొడిగింపుకై 2020 వరకు అప్పటి ప్రభుత్వానికి సంబంధింత గుత్తేదారు దరఖాస్తు చేసుకున్నారు. అయినా పనులు పూర్తి కాలేదు కదా మరలా సంబంధిత కాంట్రాక్టర్ పని చేయడానికి ముందుకు రాలేకపోవడంతో అప్పటి ప్రభుత్వమే కొత్త ఏజెన్సీని పిలిచి టెండర్ వేస్తామని వేయలేదు. ఏదిఏమైనా సంబంధిత 28 ప్యాకేజీ పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో రైతులకు సాగునీరు అందని ద్రాక్షగా మిగిలింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పనులను వేగవంతం చేసేందుకు టెండర్‌ను పిలిచి త్వరితగతిన పూర్తి చేసినట్లయితే రైతు కన్న కలలు సాకారం అవుతాయని ఇక్కడి రైతులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించినట్లయితే ప్రతీరైతు ఆనందంతో ఉంటాడని రైతులు పేర్కొంటున్నారు. ఈ దిశన ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి 28 ప్యాకేజీ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందితే సంతోషం ఉంటుందని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పంట పొలాలకు నీళ్లు అందించండి

- శివరాం, రైతు

ఈ ప్రభుత్వమైన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 28 ప్యాకేజీ పనులను పూర్తి చేస్తే మా బీడు భూములు సాగునీరుతో కళకళలాడుతాయి. త్వరి తగతిన పనులు పూర్తి చేసి మా కలలను సాకారం చేయాలని కోరుతున్నాము.

ప్రభుత్వ నుంచి ఆమోదం రాగానే పనులు చేపడతాం

28 ప్యాకేజీ పనులు మధ్యలో ఆగిపోయాయి. త్వరలో ప్రారంభిస్తాం. ప్రభుత్వం నుంచి ఆమోదం రాగానే త్వరలో టెండర్ పూర్తి చేసి పనులు చేపడుతాం. గత ప్రభుత్వంలో పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలో నిలిపివేసి పనులు చేయటానికి ముందుకు రాలేదు. ఇప్పటి వరకు 450 ఎకరాల 31 గుంటల భూమికి సంబంధించిన రైతులకు నష్టపరిహారం అందించాము. ఇటీవల కాలంలోనే మరో 83 మంది రైతులకు కూడా డబ్బులు వచ్చాయి. మరో 400ల ఎకరాల భూమి సర్వే చేయించాం. అది రెవెన్యూ క్లియరెన్స్ కొరకు పంపించాం.

- సర్వరోద్దీన్, కాళేశ్వరం జేఈ



పనులు పూర్తయితే వినియోగంలోకి రానున్న భూమి

ముగిసిన సాయిబాబా జాతర

- సాయినామ స్మరణతో మార్మోగిన ఖానాపూర్
- మహా అన్నదానానికి వేలాదిగా తరలివచ్చిన జనం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జాతరలో కిక్కిరిసిన జనం

ఖానాపూర్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలు ముగిశాయి. ఈ వేడుకల్లో భాగంగా చివరి రోజు అయిన సోమవారం ఆలయ ప్రాంగణంలో జాతర, మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా జగిత్యాల, నిజామాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాల నుండి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మహా అన్నదానానికి జనం వేలాదిగా తరలి వచ్చి సాయిబాబా అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎటు చూసినా సాయిరాం... సాయిరాం... అనే నామస్మరణే... పట్టణంలో ఏ దారి చూసినా ఆలయం వైపు వెళ్లే వాహనాలు జనాలతో కిక్కిరిసి కనిపించాయి. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఖానాపూర్ పట్టణమంతా సాయి నామస్మరణతో మార్మోగింది. సోమవారం తెల్లఆరు జాము నుండే ఖానాపూర్ పట్టణంలో సాయిబాబా జాతరసందడి నెలకొంది. ఆలయంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌లు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. జాతర సందర్భంగా తరలివచ్చిన రంగుల రాట్నం, బొమ్మల కొలువుల వద్ద చిన్నారుల సందడి కనిపించింది. సుమారు 40 వేలకు పైగా మంది సాయిబాబాను దర్శించుకుని మహాఅన్నదానంలో అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ కమిటీ బృందం తెలిపింది. ఆలయ కమిటీ, సాయిబాబా భక్తబృందం ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జాతరను పురస్కరించుకొని భారీగా భక్తులు తరలిరావడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఖానాపూర్ సీఐ మోహన్, ఎస్సై లింబాద్రిల ఆధ్వర్యంలో భద్రత ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్, కోశాధికారి శంకరయ్య, ఆలయ కమిటీ నిర్వాహకులు వేడుకలను విజయవంతం చేసేందుకు శ్రమించారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న యోగానంద సరస్వతి

ప్రజావాణిలో సమస్యలకు ప్రాధాన్యమివ్వాలి : కలెక్టర్



సమస్యలు వింటున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 : ప్రజావాణిలో ప్రజలు అందించే దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 45 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం రోజువారీ టైం టేబుల్ ప్రకారం నిర్వహించాలన్నారు. వేసవిలో ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఫైజాన్‌అహ్మద్, అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులలో అవినీతి తేలాలంటే సీబీఐ విచారణ జరపాలి

- అసెంబ్లీలో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 : తెలంగాణ ప్రాజెక్టులలో చోటుచేసుకున్న అవినీతి తేలాలంటే సీబీఐతో విచారణ జరిపించాలని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నీటిపారుదల ప్రాజెక్టులపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రజలకు అన్యాయం చేశాయన్నారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో 299 టీఎంసీ నీటికి కేసీఆర్ ఎందుకు సంతకం చేశారని ప్రశ్నించారు. సీఎం జగన్ కోసం తెలంగాణను తాకట్టుపెట్టారన్నారు. రెండు పార్టీల కారణంగా తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందన్నారు. తెలంగాణ జలాలను దోపిడీ చేస్తుంటే కేసీఆర్ అడ్డుకోలేక పోయారని ఆరోపించారు. కేఆర్ఎంబీ ఇస్తే లాభనష్టాలేమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలన్నారు.

గోదావరి నదిలో భక్తి శ్రద్ధలతో తెప్పోత్సవం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 : మండలంలోని మునిపెల్లి గోదావరి రేవుతో పాటు ఆయా గ్రామాల రేవుల వద్ద సోమవారం నిర్వహించిన తెప్పోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. ఆనవాయితీ ప్రకారం ప్రతి సంవత్సరం శివరాత్రి పర్వదినానికి ముందు ఈ తెప్పోత్సవాలను పూర్తి చేస్తారు. అనంతరం శివరాత్రి పర్వదినాలలో శివుడికి ఉపవాస దీక్షలతో పూజలు చేస్తారు. అందులో భాగంగానే ఈ తెప్పోత్సవాలను నిర్వహించి ఇంటిల్లిపాదిని క్షేమంగా ఉంచాలని, పాడి పంటలను కాపాడాలని గోదావరి (దక్షిణ గంగా మాత) మాతను వేడుకున్నారు. ఈ ఉత్సవంలో మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్, పార్‌పెల్లి, చింతల్‌చందా, చామన్‌పెల్లి, లక్ష్మణచాంద, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

'పక్క ఊరికి నడిచివచ్చి బస్సు ఎక్కుతున్నాం'

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 : మా ఊరికి బస్సు రాని కారణంగా పక్క ఊరు (గ్రామం) అయినటువంటి చామన్‌పెల్లి గ్రామానికి నడిచి వచ్చి చింతల్‌చందా టు నిర్మల్ బస్సు ఎక్కి వెళ్తున్నామని మునిపెల్లి గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించటం ఒక పక్క సంతోషం కలిగించినప్పటికీ ఆర్టీసీ వారు సరిపడా బస్సు సర్వీసులు నడపకపోవటం బాధనను కలిగిస్తుందన్నారు. ఈ సమస్య మాచాపూర్, మల్లాపూర్ గ్రామాల ప్రజలు కూడా ఎదుర్కొంటున్నారన్నారు. ఆర్టీసీ ఉదయం పూట, సాయంత్రం పూట ఒక్కో సర్వీసు నడిపి చేతులు దులుపుకుంటున్నారని ఆక్రోషం వెళ్లగక్కారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సరిపడా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

త్వరలో సర్వీసులను పెంచుతాం : నిర్మల్ ఆర్టీసీ డీఎం ప్రతిమారెడ్డి

ఈ విషయమై నిర్మల్ డీఎం ప్రతిమారెడ్డిని సంప్రదించగా ప్రస్తుతం బస్సుల సంఖ్య తక్కువగా ఉన్నందున కొన్నిచోట్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ప్రభుత్వం త్వరలో కొత్త బస్సులను కేటాయిస్తుందని, సర్వీసులను పెంచుతామని హామీ ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 : విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని అందుకోసం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి సూచించారు. సోమవారం జేవీఎన్ఆర్ పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విజ్ఞానశాస్త్రంతో పాటు పర్యావరణంపై బోధన చేయాలన్నారు. విద్యార్థి దశ నుండే పర్యావరణంపై అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు చెత్తాచెదారం లేకుండా చూడటం, నీటిని సద్వినియోగం తదితర అంశాలపై తెలియజేశారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ విద్యార్థులు మంచి పౌరులుగా ఎదగాలన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి పద్మ, ఏంఎవో నర్సయ్య, ప్రిన్సిపాల్ డి.మణికుమారి, పలు పాఠశాలల విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జేడీ

యువత ఇతరులకు ఆదర్శంగా ఉండాలి

వాహన నిబంధనలు పాటించేలా గ్రామాల్లో యువతకు అవగాహన కల్పించాలి : జిల్లా ఎస్పీ జానకి షర్మిల



డ్రైవింగ్ లైసెన్స్‌లను అందజేస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 12 : ముఖ్యంగా యువత ఇతర వాహనదారులకు ఆదర్శంగా ఉండాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ సూచించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసుశాఖ ముదుండి ఎలాంటి అదనపు రుసుములు లేకుండా కేవలం ప్రభుత్వానికి చెల్లించే చలాన్ డబ్బులను చెల్లించిన 27 మంది మారుమూల ప్రాంతాల్లోని గిరిజన యువకులకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్‌లను జిల్లా ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా వాహనాలను డ్రైవింగ్ చేసే వారికి లైసెన్స్ ఆవశ్యకతను స్పష్టంగా వివరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే బీమా కంపెనీల నుండి ఎలాంటి పరిహారం రాదని, దీనితో వాహన యజమాని బాధిత కుటుంబాలకు సొంతంగా నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. అలాగే పోలీసులు తనిఖీలు చేపట్టిన సమయంలో జరిమానాలు చెల్లించి ఆర్థికంగా నష్టపోకూడదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, గ్రామీణ సీఐ శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అలేఖ్య హత్య అత్యంత దారుణం

- నిందితులను వెంటనే ఉరి తీయాలి
- మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ సహా పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్
- న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ
- కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ, బీఎస్పీ, డీఎస్పీ, మాదిగ జాగృతి నేతలు

ఖానాపూర్, ఫిబ్రవరి 12 : ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన ఖానాపూర్ పట్టణానికి చెందిన యువతి అలేఖ్య హత్య అత్యంత దారుణమని మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ సహా పలు పార్టీలు ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లో గల అలేఖ్య నివాసానికి బీజేపీ నేత మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్, మాదిగ జాగృతి సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రమేష్ నాతరి, ధర్మ సమాజ్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రవీందర్, సహా పలువురు ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి అలేఖ్య కుటుంబానికి మద్దతు ప్రకటించారు. నడిరోడ్డుపై ఓ యువతిని హత్య చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకుని దాడికి పాల్పడడం అత్యంత కిరాతకమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇంతటి దారుణానికి ఒడి కట్టడం చూస్తే హంతకుడిలో కరుడు గట్టిన భావాజాలాలున్నాయన్నారు. ఇటువంటి వారు సమాజానికి ఎప్పటికైనా కీడు చేస్తారే తప్ప మంచి చేయరన్నారు. అలేఖ్యను కోల్పోయిన ఆ కుటుంబంలో మరో ఇద్దరు తీవ్రగాయాలతో ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందు తుండడం ఆ కుటుంబాన్ని మానసికంగా ఎంతో కుంగదీస్తుందన్నారు. ఈ సమయంలోనే యావత్ సమాజమంతా అలేఖ్య కుటుంబానికి అండగా ఉండాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. వెంటనే హంత కుడు జుంకింది శ్రీకాంత్‌తో పాటు అతనికి సహకరించిన తల్లి సత్తవ్వ, తమ్ముడు శివకృష్ణలను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి ఈ హత్య కేసులో సంబంధం ఉన్న నిందితులందరినీ కఠినంగా శిక్షించాలని నాయకులు ముక్తకంఠంతో కోరారు. అలేఖ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఓ ఉన్మాది చేసిన మారణహోమంలో తీరనినష్టం బారిన పడ్డ అలేఖ్య కుటుం బాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంతో పాటు రూ. కోటి ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని డిమాండ్ చేశారు. మానసికంగా కుంగిపోతున్న వారి కుటుంబాన్ని తిరిగి నిలబెట్టాలంటే ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ చూపించాలని వారంతా కోరారు. ఈ వేరువేరు కార్యక్రమాలలో బీజేపీ నాయకులు, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్, జిల్లా నాయకులు అనిల్‌రావు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు జాఫర్ అహ్మద్, అంజయ్య, సుధాకర్, మహారాజ్, భూమేష్, హరిప్రసాద్, ముత్యం, తదితరులున్నారు.



అలేఖ్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రమేష్ రాథోడ్

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో బన్సపల్లి యువతి మృతి



దిలావర్‌పూర్, ఫిబ్రవరి 12 : హైదరాబాద్‌లోని మాదాపూర్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బన్సపల్లి గ్రామానికి చెందిన సత్యం ప్రత్యూష(21) మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల వివరాల ప్రకారం బన్సపల్లి మాజీ సర్పంచ్ సత్యం లక్ష్మీ సక్కారాం కూతురు ప్రత్యూష హైదరాబాద్ ఉన్నత విద్యనభ్యసిస్తూనే ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. స్నేహితురాలితో కలిసి స్కూటీపై భోజనానికి వెళ్తుండగా వీరు ప్రయాణిస్తున్న స్కూటీ అదుపు తప్పిన డివైడర్‌కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రత్యూష మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. కాగా గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే ప్రత్యూష రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందన్న వార్త గ్రామంలో విషాదాన్ని నింపింది.

స్పీడ్‌బ్రేకర్స్ తొలగించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



హైవేపై నుంచి కాకుండా స్కూల్ ముందర గల సర్వీస్ డాంబర్ రోడ్‌పై నుంచి వెళ్తున్న వాహనాలు

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 12 : మండలంలోని కనకాపూర్‌లో గల అక్షర హైస్కూల్ ముందర గల హైవేపై వేసిన స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని ఆ స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ నరేష్‌రెడ్డిలు సోమవారం నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ స్పీడ్ బ్రేకర్లు స్కూల్ ముందర గల సర్వీస్ డాంబర్ రోడ్‌పై కాకుండా ఖానాపూర్ హైవేపై వేశారని, దీని కారణంగా వాహనాలన్నీ స్కూల్ ముందర గల సర్వీస్ డాంబర్ రోడ్‌పై వెళ్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తద్వారా స్కూల్ పిల్లలకు, తల్లిదండ్రులకు, సిబ్బందికి ప్రమాద పరిస్థితి నెలకొందన్నారు. కావునా హైవేపై గల స్పీడ్‌బ్రేకర్లను తొలగించి స్కూల్ ముందర గల సర్వీస్ రోడ్‌పై వేయాలని కోరారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

నర్సాపూర్(జి), జనవరి 12 : మండల కేంద్రంలోని కాలువ భూములను వాస్తవాన్ని దాచిపెట్టి నాలా అనుమతులు మంజూరీ చేసిన సర్వేయర్, గిర్దావర్, తహసీల్దార్‌లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గతంలో రెండుసార్లు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పిర్యాదు చేసినా అధికారులు పట్టించు కోవడంలేదని దరఖాస్తులో పేర్కొన్నారు.

అంజుమన్ ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 : నిర్మల్ పట్టణం అంజుమన్ ఫలాహే ముస్లిం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద యువతికి ఆదర్శ వివాహం జరిపించారు.

మేనల్లుడి మృతికి

కారకుడైన మేనమామకు జీవితకాల జైలు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 : తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు మేనల్లుడైన శివకుమార్‌ను మేనమామ గనుంగొని గోపి చితకబాదడంతో ఆసుపత్రిలో మృతి చెందాడు. ఇందుకు కారణమైన మేనమామ గోపికి జీవితకాల కఠిన జైలుశిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ.కర్ణకుమార్ సోమవారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయ అధికారి ఎస్సై సక్రియానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన 2019 జూన్ 1న చోటు చేసుకుంది. మృతుడు శివకుమార్ నిర్మల్ మండలం ముజ్గి గ్రామానికి చెందినవాడు. గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు వీసా రాగా మేనమామ గోపికి గతంలో ఇచ్చిన డబ్బులు వసూలు చేసుకునేందుకు నిర్మల్‌లోని రామారావు బాగ్‌కు వెళ్లాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య గొడవ జరిగిందని తెలిపారు. నిందితుడు మేనల్లుడిని ఇష్టారీతిగా కొట్టి గొంతు నులుమగ స్పృహ కోల్పోయాడని ఆసుపత్రి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. నిర్మల్ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ జాన్‌దివాకర్ కేసునమోదు చేసి దర్యాప్తు జరిపారు. నేరస్థుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోద్ రావు 15 మంది సాక్షులను ప్రవేశపెట్టి విచారించగా నేరం రుజువైందన్నారు. జైలుతో పాటు నిందితుడికి వేయి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారన్నారు.

నిర్మల్ జడ్పీ సీఈవోగా గోవింద్

● కొనసాగుతున్న అధికారుల బదిలీలు

భైంసా, ఫిబ్రవరి 12 : పార్లమెంట్ ఎన్నికల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్‌ల బదిలీలు జరిగిపోయాయి. తాజాగా సోమవారం నిర్మల్ జిల్లా పరిషత్ సీఈవోల బదిలీల జరిగాయి. జిల్లా సీఈవోగా ఉన్న ముప్పిరి సుధీర్ వికారాబాద్ జడ్పీకి సీఈవోగా బదిలీ అయ్యారు. అయన స్థానంలో నిజామాబాద్ జడ్పీ సీఈవో గోవింద్ ఇక్కడకు బదిలీపై వచ్చారు

● జిల్లా పంచాయతీ అధికారిగా పి.శ్రీనివాస్

ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లా పంచాయతీ అధికారుల బదిలీలు సైతం జరిగాయి. నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారిణిగానున్న శ్రీలత ఆదిలాబాద్ డీపీవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఆదిలాబాద్ జిల్లా పంచాయతీ అధికారిగానున్నపి.శ్రీనివాస్ ఇక్కడి జిల్లా పంచాయతీ అధికారిగా బదిలీ అయి వచ్చారు. జిల్లాలోని భైంసా డివిజన్ డీఎల్‌పీవోగానున్న ఎ.శివకృష్ణ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ డీఎల్‌పీవోగా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించలేదు.

మానవ హక్కులపై అవగాహన సదస్సు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 12 : టీఎన్జీవో భవనంలో సోమవారం మానవ హక్కుల హెల్ప్ అసోసియేషన్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మానవ హక్కుల సంఘం పరిరక్షణ కమిటీ ఛైర్మన్ మొహమ్మద్ సాహిల్ ఖాన్, రాష్ట్ర లీగల్ సెల్ ఛైర్మన్ ఎంఏ సలీం హాజరయ్యారు. సమాచార హక్కు చట్టం 2005 గూర్చి వివరించారు. హెల్ప్ అసోసియేషన్ గుర్తింపు కార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ హైదర్, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని బీర్సాయిపేట్, కొత్తగూడ, నర్సాపూర్(బి) గ్రామాలలో సీసీ రోడ్లు, మురికి కాలువల, పనులకు భూమిపూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందని, త్వరలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సబ్బండ వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖయ్యూమ్, మొహ్మద్ఎక్బాల్, లింగంపల్లి చంద్రయ్య, ఆత్రం రాహుల్, పీఆర్డీఈఈ పవర్‌రమేష్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12: కృష్ణా జలాలపై మాజీ సీఎం కేసీఆర్ రాద్ధాంతం చేస్తున్నారని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ అన్నారు. కేసీఆర్ తీరును నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్టీఆర్ చౌక్‌లో మాజీ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ కృష్ణా జలాల అంశంపై పోరాటం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీలో మాట్లాడడానికి అవకాశం ఇచ్చినా దానికి కేసీఆర్ హాజరు కాలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్ననేపథ్యంలో ప్రజలు తప్పుతోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఏం చేసిందని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని విధాలుగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా అసెంబ్లీలో జరిగే సమావేశాల్లో బీఆర్ఎస్ సమాధానాలు చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ అడ్డిభోజారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేష్, రూపేష్, రషీదుల్‌హక్, తదితరులు పాల్గొన్నారు.

'అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు'

తలమడుగు, ఫిబ్రవరి 12: ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ రమాకాంత్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసినకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు పప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అంకిత భావంతో పని చేస్తేసమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు పదోన్నతులు పదవి విరమణ సహజమైనప్పటికి ప్రజలతో కలిసి పోవాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందించే బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. కొత్తగా ఉద్యోగాలుచేరేవారు. ఉన్నతాధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. అనంతరం పంచాయతీ సెక్రటరీ ఆయనను ఘనంగా సన్మానించారు. ఇందులో కార్యాలయ సిబ్బంది ఉపాధి సిబ్బంది పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.

ఘనంగా భక్త మార్కండేయ జయంతి

నేరడిగొండ, ఫిబ్రవరి 12: మండలంలోని కుమారి గ్రామంలో భక్త మార్కండేయ జయంతి ఉత్సవాలను స్థానిక పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అలకంటి రమణయ్య, ఉపాధ్యక్షుడు కైరంకొండ లచ్చన్న, కార్యదర్శి డోకూరు మహేందర్, వీడీసీ అధ్యక్షుడు పొట్టపర్తి శ్రీనివాస్, సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండలో జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సంఘం సభ్యులు

జైనథ్: మండలంలోని ఆయా గ్రామాలతో పాటు మండల కేంద్రమైన జైనథ్‌లో పద్మశాలీ సంఘ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ మహర్షి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం జైనథ్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే రోజులు పద్మశాలీలు హక్కుల కొరకు ప్రభుత్వాలతో పోరాటాలను నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల కోశాధికారి కుర్రరవీందర్, దాసరివెంకటి, జైనథ్ గ్రామ మాజీ సర్పంచ్ డి.దేవన్న, ఎంపీటీసీ కె.సుదర్శన్, పద్మశాలి సంఘం నాయకులు మ్యానసురేష్, ఆడెళ్లబాయి, దాసరి అడెల్లు, పద్మశాలీ కులస్థులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో సోమవారం మహర్షి మార్కండేయ జయంతి వేడుకలను పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మార్కండేయ మహర్షి గురించి పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి : సీఐటీయూ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12: జిల్లా కేంద్రంలోని బేవరేజ్ కార్పొరేషన్ హమాలీ ఐఎంఎల్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు హాజరై మాట్లాడారు. ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజాకార్మిక రైతు వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను నిరసనగా జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్, ఇతర కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిల భారత ఫెడరేషన్లు, సంయుక్త కిషన్ మోర్చా రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణబంద్‌ను జయప్రదంచేయాలన్నారు. ఈ సమ్మెలో బేవరేజ్ హమాలీ కార్మికులు కూడా సమ్మెలో భాగస్వాములు కావాలని తెలంగాణ హమాలీ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దర్శనాల నగేష్, అగ్గిమల్ల స్వామి, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు ఎం.జనార్దన్,ఎ.నారాయణరెడ్డి, అగ్గిమల్ల స్వామి, బేవరేజ్ కార్పొరేసన్ ఐఎంఎల్ హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మినారాయణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అర్బన్: ఈనెల 16న జరిగే కార్మిక కర్షక దేశవ్యాప్త సమ్మెకు టీఏజీఎస్ మద్దతు తెలుపుతున్నట్లు టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక కర్షక, గిరిజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన సమ్మెకు తెలంగణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మోదీ ప్రభుత్వ హయాంలో ఆదివాసీలపై దాడులు, అడవుల ప్రైవేటీకరణ, షెడ్యూల్ ప్రాంతాల ఎత్తివేత, అటవీ చట్టాల నిర్వీర్యం జరిగిందని, మోదీ ప్రభుత్వ గిరిజన వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మెలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

కనుగుట్టలో అక్రమ కలప పట్టివేత

బోథ్, ఫిబ్రవరి 12: మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఎన్.శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన లక్ష రూపాయల విలువైన కలప సైజులను పట్టుకోవడం జరిగిందని ఆదిలాబాద్ టాస్క్ ఫోర్స్ రేంజ్ అధికారి వాహెబ్ అహ్మద్ తెలిపారు తమకున్న పక్కా సమాచారంతో సోమవారం కనుగుట్టలో శ్రీనివాస్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేయగా లక్ష రూపాయల విలువైన కలప సైజుల పట్టుబట్టాయన్నారు. దాడిలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు ఆర్.గులాబ్‌సింగ్, ప్రవీణ్, సజన్లాల్, శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారని తెలిపారు. ఎవరైనా అక్రమంగా కలప నిలువ చేసినట్లయితే చట్ట ప్రకారము చర్యలు తప్పవని పేర్కొన్నారు.



ఇచ్చోడలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

'అధ్యాపకుల బదిలీలను చేపట్టాలి'

ఇచ్చోడ, ఫిబ్రవరి 12: గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో కొత్త నియమాకాలు, ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పలువురు మాట్లాడుతూ.. ఇచ్చోడ పాఠశాలలో విధులు నిర్వహించే ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్నో ఏళ్లుగా బదిలీలు, నియమాకాలు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రఫీక్, హేమలత, సుల్తానా, రామకృష్ణ, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ

తాంసి, ఫిబ్రవరి 12: కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రతీఒక్కరు స్పందించి సహకరించాలని ఆరోగ్యశాఖ అధికారి తులసీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని గోటుకూరి గ్రామంలో కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలలోని ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని అన్నారు. ఆశా వర్కర్లతో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది తమ విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలన్నారు. ముఖ్యంగా ఏమైనా వ్యాధులు సోకినట్లయితే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

ఏపీవోల సంఘ జిల్లా అధ్యక్షుడిగాశ్రీనివాస్

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి12: ఉపాధి హామీ పథకంలో జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఏపీవో)ల జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బజార్‌హత్నూర్ మండలం అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీనివాస్‌ను, ఉపాధ్యక్షుడిగా శ్యాముల్, కార్యదర్శిగా జగ్దేరావు, సంగీత, మేగమాల, సుభాషిణి, జాకీర్, హుస్సేన్, వసంత్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వారు తెలిపారు.

విద్యుత్ తీగలు అమరిస్తే చర్యలు : ఎస్పీ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12: జిల్లాలో అడవి జంతువులను వేటాడడానికి, పంటకు రక్షణగా అక్రమంగా విద్యుత్ తీగలు అమర్చినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. అడవి జంతువులను వేటాడే క్రమంలో వేటగాళ్లు కరెంట్ తీగలను అమర్చడం వల్ల, పంట పొలాలకు రక్షణగా జంతువుల భారీ నపడకుండా విద్యుత్ తీగలు అమర్చి క్రమంలో, పంట పొలాలకు వెళ్లే రైతులు, జంతువులు, అటుగా వెళ్లే పోలీసు, ఫారెస్టు సిబ్బంది ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా శిక్షార్హులన్నారు. నేరం రుజువైతే 10ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్ష లేదా యావజీవకారాగార శిక్షపడే అవకాశం ఉన్నందున ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నార్నూర్ మండలానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ ఆదివారం కూంబింగ్ ఆపరేషన్‌లో భాగంగా కాటారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇలాంటి కరెంట్ దుశ్చర్యలకు పాల్పడడం వల్ల మరణించడం శోచనీయమని, వారికి జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరంగా వచ్చే ప్రతి ఒక్క లబ్ధిని సకాలంలో అందేలా కృషి చేస్తానని తెలిపారు. అలాగే జిల్లాలో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వారి సమాచారం అందజేయాలని, సమాచారం అందజేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని మావల, గుడిహత్నూర్, బోథ్, తలమడుగు మండలాల్లో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం వల్ల నలుగురు అమాయకులు మరణించడం జరిగిందని, ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండాతగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

'ప్రొటోకాల్ లేని వ్యక్తి అధికారిక కార్యక్రమాలో ఎలా పాల్గొంటారు?'

నేరడిగొండ, ఫిబ్రవరి 12: ప్రొటోకాల్ లేని వ్యక్తి అధికారిక కార్యక్రమాలలో ఎలా పాల్గొంటారని మండల కన్వీనర్ శివారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మండల కన్వీనర్ శివారెడ్డి మాట్లాడూత ప్రొటోకాల్ లేని వ్యక్తి ఒక పార్టీకి చెందిన వ్యక్తి అధికారిక కార్యక్రమాలలో ఎలా పాల్గొంటారు అని అన్నారు. ఆడె గజేందర్ అనే వ్యక్తి ఆయనకు ఏ విధమైన ప్రోటోకాల్ ఉంది, ఆయన అధికారిక సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజలలో ఏ విధంగా పాల్గొంటారని, ఇది ఎక్కడి ప్రజాస్వామ్యం అని అన్నారు. అదేవిధంగా స్థానిక శాసనసభ్యుడు ఎస్ఆర్ఈజీఈ కింద రూ.6 కోట్లు మంజూరు చేసి కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి అని ఆయనకు రూ.7 కోట్లు ఏవిధంగా మంజూరు చేస్తారు అని ప్రశ్నించారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజాస్వామ్యానికి అప్రతిష్ఠ అని అన్నారు. ఇలాంటి మళ్లీ పునరావృతంకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్‌సజన్, సర్పంచ్ పెంట వెంకటరమణ, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సురేందర్, ప్రతాప్‌సింగ్, పవన్‌సర్పంచ్, గులాబ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో సమస్యల వెల్లువ

బోథ్, ఫిబ్రవరి 12: బోథ్ గ్రామ పంచాయతీ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొన్న పలువురు గ్రామస్థులు గ్రామంలో నెలకొన్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సరిగాలేదని సమావేశంలో పలువురు పేర్కొన్నారు. సాయి నగర్ కాలనీలో రోడ్లు మురికి కాలువ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలో రేషన్ షాప్ ఏర్పాటు చేసి ఇబ్బందులు తొలగించాలని కోరారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, సామాజిక సేవకులు జక్కుల వెంకటేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పారిశుధ్యం పనులు సక్రమంగా నిర్వహించాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సునీల్ రెడ్డి, సెక్రెటరీ పుల్కం అంజయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

ఘనంగా మార్కండేయ జయంతి

ముథోల్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని చించాల గ్రామంలో సోమవారం మార్కండేయ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండితులు బసవ రాజు ఆధ్వర్యంలో చించాల ఆలయంలో యజ్ఞం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



పెంబిలో మార్కండే జయంతి వేడుకలు నిర్వహిస్తున్న భక్తులు

పెంబి, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో మార్కండేయ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మార్కండేయ జయంతి సందర్భంగా పద్మశాలి యువకులు 21 రోజుల పాటు మార్కండేయ మాల ధరించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం మాల విరమణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు చింతకింది రాజన్న సభ్యులు తులాల రాజలింగు, కంఠం సదానందం, జోగు రమేష్, తదితరులు పాల్గొన్నారు.



భోసిలో మార్కండేయ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

తానూర్, ఫిబ్రవరి 12 : మండలంలోని భోసి గ్రామంలో మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా మార్కండేయ మహారుషి చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు సమర్పించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగులచిన్నన్న, మాదస్తు గంగాధర్, మాముల్ల శంకర్, సబ్బన్ సాయినాథ్, సబ్బన్ రఘు, బొంతి పోశెట్టి, మాదస్తు దశరథ్, మాదస్తు బాలాజీ, సబ్బన్ సాగరబాయి, మాముల్ల రజిత తదితరులు పాల్గొన్నారు.

బాసరలో వసంత పంచమి ఉత్సవాలకు అంకురార్పణ

● అమ్మవారి సన్నిధిలో ప్రారంభమైన వేడుకలు ● శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రారంభించిన పండితులు
● తొలిరోజు అమ్మవారిని దర్శించుకున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్



అమ్మవారిని దర్శించుకొని పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే రాంరావు పటేల్



ఉత్సవ పూజలు ప్రారంభిస్తున్న ఆలయ పండితులు

బాసర, ఫిబ్రవరి, 12: బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో వసంతపంచమి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. దేవస్థాన అర్చన వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రోశ్చరణాల మధ్య వేడుకలను ప్రారంభించారు. ఉదయమే సరస్వతి అమ్మవారికి అభిషేక పూజలు నిర్వహించిన పండితులు అనంతరం దినమంతా వివిధ పూజా కార్యక్రమాలను జరిపారు. ప్రారంభోత్సవ పూజల్లో ఆలయ ఈవో విజయరామారావు, ఛైర్మన్ శరత్‌పాఠక్ పాల్గొని పూజలు నిర్వహించారు. తొలిరోజు సోమవారం భక్తుల రద్దీ సాధారణంగా కనిపించింది. ముఖ్యంగా ఉత్సవాల్లో చివరిరోజు అమ్మవారి జయంతి పర్వదినమైన వసంత పంచమి రోజు పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకోనున్నారు. ముఖ్యంగా అమ్మవారి జన్మదినమైన వసంతపంచమి నాడు తమ పిల్లలకు అక్షర శ్రీకారపూజలు జరిపించేందుకు భక్తులు తరలివస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి భక్తులు ఈ వేడుకలకు హాజరవుతారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అక్షర శ్రీకార పూజల సమయాల్లో అధికారులు మార్పులు చేశారు. ఉదయం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పూజలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

బాసర సరస్వతి అమ్మవారిని వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని తొలిరోజు సోమవారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఉత్సవాలకు హాజరయ్యే భక్తుల కోసం ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ ఈవోను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి చిన్నపిల్లలతో భక్తులు వచ్చే అవకాశమున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నాయకపోడు తెగకు

సీరియల్ నెంబర్ కేటాయించాలి

● రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 12 : ఆదివాసి నాయకపోడు తెగకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, మూడు తెగలు ఒకే సీరియల్ నెంబర్ 6లో ఉండడం వల్ల జనాభా ప్రతిపాదికంగా నష్టపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే నాయకపోడు తెగకు సీరియర్ నెంబర్ కేటాయించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకగారి భూమయ్య డిమాండ్ చేశారు. పత్రికా సమవేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1940 సంవత్సరంలో ప్రొఫెసర్ హైమన్ డ్రాఫ్ రాకతో అడవులలో నివసించే ఆదివాసుల జీవనం ఎలా ఉంది అని పరిశీలన చేసి ట్రైబల్ ఏరియాస్ రెగ్యులేషన్ 1359 ద్వారా ఆదివాసి గిరిజన తెగలుగా గుర్తించి బిల్, చెంచు, గోండు, నాయకపోడు, హిల్ రెడ్డి, కోలాం, కోయ, పర్ధాన్, తోటీలను గుర్తించారు. ఆ తెగలలో ఉప తెగలుగా అనుమతిస్తూ 1950లో ఇండియన్ యూనియన్ అధికారం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ సలహా మేరకు తోటి, అంద్ అనే తెగలను చేర్చి అలాగే నాయకపోడులను గోండు, నాయకపోడు, రాజ్‌గోండులుగా చేర్చారు. ఇలా చేర్చడం వల్ల నాయకపోడు తెగ జనాభా పరంగా నష్టం జరుగుతుందని అందుకే ఏ రాజకీయ పార్టీ కూడా తమ జాతిని గుర్తించడం లేదని, ప్రభుత్వాల నుండి వచ్చే ఫలాలు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ తెగకు సీరియల్ నెంబర్ కేటాయించాలని డిమాండ్ చేశారు. భారత దేశంలో 8 రాష్ట్రాలలో నాయకపోడు తెగ ఉందన్నారు. గోండు నాయకపోడు, రాజ్‌గోండు తెగలకు వేరువేరు సీరియల్ నెంబర్లు కేటాయించాలని అప్పుడే సమనా న్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగ, విద్య, సంక్షేమ పథకాలు, రాజకీయంగా అన్ని విధాల నష్టం జరుగుతుందన్నారు. ఈ సమావేశ ంలో జిల్లా ఉపాధ్యక్షులు సాకి లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి సూరపు సాయన్న, జిల్లా సభ్యులు రాజుల నారాయణ, ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. ఎల్లయ్య, సభ్యులు మంద వెంకట్, తదితరులున్నారు.



రోడ్డుపై బైఠాయించిన హిప్నెల్లి రైతులు

నష్టపరిహారం అందించాలని రైతుల రాస్తారోకో

తానూర్, ఫిబ్రవరి 12 : ఈదురు గాలులతో కూడాన వర్షానికి పంటనష్టం వాటిల్లిందని పరిహారం అందించాలని డిమాండ్ చూస్తూ మండలంలోని హిప్నెల్లి రహదారిపై రైతులు సోమవారం రాస్తారోకో నిర్వహించారు. ఆదివారం కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి పంటలు నెలకొరిగి తమకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వ ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై లోకం సందీప్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. ఆదివారం కురిసిన వర్షానికి మండలంలోనిహిప్నెల్లి, మొగ్లి, మసల్గ, మసల్గ తండా, దౌలతాబాద్, హంగీర్గ, తదితర గ్రామాల్లోని మొక్కజొన్న, జొన్న, వరి, తదితర పంటలు దాదాపు 900ల వరకు నష్టపోయినట్లు ఏవో గణేష్ తెలిపారు.

చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ

భైంసా రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని మహాగాం గ్రామంలో చిట్యాల (చాకలి) ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి సోమవారం విగ్రహాన్ని ఆవిష్కరించారు.

అకాల వర్షానికి

మొక్కజొన్న పంట నష్టం



నష్టపోయిన పంటను చూపిస్తున్న రైతు

ముథోల్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని చించాల, తరోడా, రాంటెక్, వెంటాపూర్, ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్ తండా తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి అకాల వర్షం కురిసింది. సుమారు 40 నిమిషాల వరకు కురిసిన ఈ వర్షం కారణంగా మండలంలోని సుమారు 80 ఎకరాల వరకు మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అజ్మీరా భాస్కర్ తెలిపారు. సోమవారం వ్యవసాయ శాఖ ఏఈవోలు, ఏవో మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించి ప్రాథమిక అంచనా ప్రకారం మండలంలో మొత్తం 80 ఎకరాల వరకు మొక్కజొన్న పంటకు నష్టం జరిగిందని తెలిపారు.

ఈదురు గాలులకు

నేలకొరిగిన పంటలు



కుభీర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంట

కుభీర్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంతో పాటు మండలంలోని జాంగా, సొనారి, పార్డి(కే) తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి రైతులు సాగు చేసిన మొక్కజొన్న, జొన్న పంటలు దాదాపు 100ఎకరాలు నేలకొరిగినట్లు వ్యవసాయ శాఖ అధికారలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి

పరీక్షకు విద్యార్థుల ఎంపిక

కుభీర్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రం కుభీర్‌లోని ఉన్నత పాఠశాల విద్యార్థులు కే. అక్షయ 10వ తరగతి, ఏ.పవన్‌కళ్యాణ్ 9వ తరగతి, ఎస్. ధనశ్రీ 9వ తరగతి రాష్ట్ర స్థాయి చెకుముకి పరీక్షకు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయులు జే సాయన్న తెలిపారు. వీరిని సోమవారం జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గాజర్ల నారాయణవర్మ, ప్రధాన కార్యదర్శి అంకం గంగాధర్, డీఈవో రవీందర్‌లు అభినందించారు.

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 । కనిష్ఠం 21.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
మంగళవారం 13 ఫిబ్రవరి 2024


● నాగోబా(శేషనాగు) దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు


● సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తజనం

● నాగోబా హారతి ఇస్తున్న మంత్రి సీతక్క, తదితరులు

నమో నాగోబా

- నాగోబా మహా జాతరకు పెద్దఎత్తున తరలివస్తున్న జనం
- ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ, గిరిజనుల దారులన్నీ కేస్లాపూర్ వైపే..
- శేషనాగు(నాగోబా) దర్శనం కోసం బారులు తీరిన భక్తులు
- గిరి దర్బార్‌లో అర్జీల స్వీకరణ
- హాజరైన ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, నేతలు
- ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం కలిసికట్టుగా పనిచేయాలి : మంత్రి సీతక్క
- త్వరలోనే సుప్రీంకోర్టు ద్వారా ఆదివాసీలకు న్యాయం : ఎంపీ సోయం
- ప్రసంగాలకే పరిమితమైన దర్బార్ వేదిక
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- నేడు బేతాల్, మండగాజలింగ్‌తో ప్రత్యేక పూజలు చేయనున్న మెస్రం వంశీయులు





ఆదిలాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి)/ఇంద్రవెల్లి: రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద గిరిజన జాతరగా పిలుచుకునే కేస్లాపూర్ నాగోబా మహా జాతరకు రాష్ట్రంలోని ఆయా జిల్లాలతో పాటు పక్కనే ఉన్న రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో నమో నాగోబా అంటూ తరలివస్తున్నారు. ప్రతియేటా నాగోబా జాతర సందర్భంగా నిర్వహించే ప్రజాదర్బార్‌లో ఆదివాసీ గిరిజనులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నాగోబా జాతరలో భాగంగా సోమవారం నాల్గవ రోజున నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన కనిపించింది. ఈ దర్బార్‌కు ఉమ్మడి ఆదిలాబాద్‌లోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఆదివాసీ 9 తెగల ప్రజలు భారీసంఖ్యలో హాజరయ్యారు. అయితే, ప్రజాదర్బార్ వేదికగా ఆదివాసీల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు.. ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు కనిపించనే లేదు. దర్బార్‌లో కేవలం ఫిర్యాదులు తీసుకోవడంతోనే అధికారులు సరిపెడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో తీసుకున్న ఫిర్యాదులకు ఎలాంటి పరిష్కారం చూపారో? చెప్పాలని పలువురు ఆదివాసీ సంఘాల నేతలు ప్రశ్నించారు. అసలు ఆదివాసీలు ఇచ్చిన ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వెళ్తున్నాయా? లేదా? అనే దానిపై అనుమానాలు వ్యక్తం చేశారు. ఫిర్యాదులను స్వీకరించి అక్కడికక్కడే పరిష్కారం చూపాల్సి ఉంటుంది. కానీ, ఏఒక్క సమస్యకు పరిష్కారం చూపకుండానే నేతల ప్రసంగాలతో ప్రజాదర్బార్‌ను ముగించారు. ఈ దర్బార్‌కు మంత్రి సీతక్క, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ గోడం నగేష్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ గౌస్‌ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బుగుప్తా, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, ఆలయ కమిటీ చైర్మన్ నాగోరావు, పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీలు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు హాజరయ్యారు.

నాగోబాను దర్శించుకున్న ప్రముఖులు

అంతకుముందు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు నాగోబా సన్నిధిలో ప్రత్యేక పూజలతో తరించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం అతిథులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం స్థానిక కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా, శాఖల వారీగా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాదర్బార్‌కు హాజరైన ఏ ఒక్క శాఖ పరిధిలోని సమస్యపై అధికారులను ప్రశ్నించిన దాఖలాలు కనిపించ లేదు. ప్రతీసారి ఫిర్యాదులు తీసుకోవడం, ఆ తర్వాత పరిష్కరించకుండానే వదిలేయడంపై ఆదివాసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీలో ఉన్నత విద్యా అవకాశాలు లేకపోవడంతో ఆదివాసీ విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆదివాసీ సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాదర్బార్‌కు భారీసంఖ్యలో ఆదివాసీ గిరిజనులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కళానృత్యాలు ఆహూతులను అలరించాయి. ముఖ్యంగా ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను గుర్తుచేసే విధంగా భద్రాచలం నృత్య కళాబృందం, పలువురు విద్యార్థులు, కళాకారులు నృత్య ప్రదర్శనలను చేశారు.

దుమ్మాకొట్టిన అధికారులు

నాగోబా జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు పలువురు జిల్లా ఉన్నతాధికారులు దుమ్మాకొట్టారు. దర్బార్‌కు ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజను లు పెద్దఎత్తున తరలివచ్చారు. వారి సమస్యలు చెప్పుకునేందుకు జిల్లా అధికారులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. జిల్లా కలెక్టర్ తప్ప ఆసిఫాబాద్, మంచిర్యాల్, నిర్మల్ జిల్లా కలెక్టర్లు, ఇతర ముఖ్య శాఖల అధికారులు హాజరు కాలేదు. ప్రతియేటా ప్రజాదర్బార్‌ను మొక్కుబడిగా నిర్వహించి సమస్యలను పరిష్కరించడంలో నేతలకు, అధికారులకు చిత్తశుద్ధి కరువైందన్న వాదనలు వెల్లువెత్తాయి. ఫిర్యాదులు తీసుకోవడమే తప్ప.. తక్షణ పరిష్కారం చూపడం లేదని ఆదివాసీ గిరిజనులు మండిపడ్డారు. కాగా, ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన ఫొటో గ్యాలరీని ఏర్పాటు చేయకపోవడంపై మంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు బేతాల్, మండగాజలింగ్ పూజలు

కేస్లాపూర్ నాగోబా మహా జాతరలో మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో మంగళవారం బేతాల్ పూజ, మండగాజలింగ్ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్ రావు పటేల్ తెలిపారు.

ఫ్రెండ్లీ పోలీసుతో సమస్యలు ఉండవు
: గౌసంఆలం ఎస్పీ, ఆదిలాబాద్

ఫ్రెండ్లీ పోలీసుతో ఎలాంటి సమస్యలు ఉండవు. నాగోబా జాతరకు అవసరమైన పకడ్బందీ చర్యలు చేపట్టాం. దాదాపుగా 500ల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పోలీసులతో స్నేహపూర్వకంగా ఉండి ఎలాంటి సమస్యనైనా సామరస్యంగా శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. గతంలో మాదిరిగా పోలీసు వ్యవస్థ లేదు. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకునే అవకాశం ఉంది.



ఏడు రకాల సమస్యలకు ప్రాధాన్యత
: రాహుల్‌రాజ్, జిల్లా కలెక్టర్, ఆదిలాబాద్

ఏజెన్సీలో నెలకొన్న ఏడు రకాల సమస్యలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తాం. సమస్యల పరిష్కారానికి అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నాం. మెరుగైన వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో సుమారుగా 400ల గ్రామాలకు త్రీఫేజ్ కరెంట్‌ను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్లను నిర్మిస్తాం.



అందుబాటులోకి 60 రకాల వైద్య పరీక్షలు
: వెడ్మబొజ్జు, ఎమ్మెల్యే ఖానాపూర్

ఉట్నూర్‌లోనే 60రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇక పై ఏ రక్త పరీక్షకైనా జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేదు. సీఎం రేవంత్‌రెడ్డిపై పూర్తి విశ్వాసం ఉంది. యూనివర్సిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే స్థల సేకరణ కూడా పూర్తయ్యింది. గిరిజన యూనివర్సిటీలోని ఏదో ఒక శాఖను ఉట్నూర్‌లో ఏర్పాటు చేయాలి. మిగిలి న అమరవీరుల కుటుంబాన లు ఆదుకుంటాం.



త్వరలో ఆదివాసీలకు న్యాయం జరుగుతుంది
: సోయం బాపురావు, ఎంపీ

త్వరలోనే సుప్రీంకోర్టు ద్వారా ఆదివాసీలకు న్యాయం జరుగుతుంది. చట్టబద్ధత లేని కులాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి. రాష్ట్ర వ్యాప్తంగా పోడు భూములను సాగుచేసుకుంటున్న 2లక్షల మంది ఆదివాసీ రైతులకు ప్రభుత్వం వెంటనే పోడు పట్టాలు ఇవ్వాలి. జీవో నెంబర్ 3కి సుప్రీంకోర్టులో వ్యతిరేకంగా తీర్పువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. ఆదివాసీలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. కేవలం ఇంటర్ వరకే చదువుకుని చదువులు మానేస్తున్నారు. వారికి అవసరమైన విద్యా అవకాశాలను కల్పించాలి.



కలిసి కట్టుగా పని చేస్తేనే అభివృద్ధి
: సీతక్క రాష్ట్ర మంత్రి

అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే ఉమ్మడి జిల్లా అభివృద్ధి సాధ్యమవుతుంది. గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏను మరింత బలోపేతం చేస్తాం. కచ్చితంగా ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారు. మొదటిసారి సీఎం ఆదిలాబాద్‌లో పర్యటించి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఎందరో పోరాట యోధులు జీవించిన గడ్డపై నాకెంతో అభిమానం ఉంది. ప్రజాదర్బార్‌లో పోరాట యోధులకు సంబంధించిన ఫొటోలను కచ్చితంగా ఏర్పాటు చేయాలి. ప్రజాదర్బార్ ఉద్దేశాన్ని భావితరాలకు తెలియచెప్పే విధంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలి. వెంటనే దానికి సంబంధించిన నిధులను మంజూరు చేస్తాం. ప్రజాదర్బార్‌లో గిరిజనులు ఇచ్చిన ఫిర్యాదులకు అధికారులు తిరిగి సమాధానం ఇవ్వాలి.



సంక్షిప్త సమాచారం

జడ్పీ సీఈవోగా రత్నమాల

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి12: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్ సీఈవోలను బదిలీ చేస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జడ్పీ సీఈవోగా రత్నమాలను నియమించారు. ప్రస్తుత సీఈవో గణపతిని మంచిర్యాల జిల్లా పరిషత్ సీఈవోగా బదిలీ చేయగా కుమురంభీం ఆసిఫాబాద్ జడ్పీ సీఈవోగా ఉన్న రత్నమాలను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు.

ఆదిలాబాద్ డీఆర్డీవో బదిలీ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 12: రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ డీఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న ఎస్.కిషన్‌ను మంచిర్యాల జిల్లా డీఆర్డీఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కామారెడ్డి డీఆర్డీవోగా కొనసాగుతున్న జి.సాయన్న జిల్లా డీఆర్డీవోగా రానున్నారు.

ఇచ్చోడ సీఐ బాధ్యతల స్వీకరణ

ఇచ్చోడ, ఫిబ్రవరి12: ఇచ్చోడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా భీమేష్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. బోథ్ సర్కిల్ సీఐగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై ఇచ్చోడకు సీఐగా నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ పెద్దపల్లి చంద్రశేఖర్ ఆదిలాబాద్ సీసీఐ సీఐగా బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ భీమేష్‌ను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించారు.

15న మండల సమావేశం

తాంసి, ఫిబ్రవరి 12: ఈనెల 15న మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో భూమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, అన్ని శాఖల అధికారులు, ప్రత్యేక అధికారులు, ప్రత్యేక అధికారులు, ఆయా గ్రామాల కార్యదర్శిలు, ప్రజాప్రతినిధులు, సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశానికి రాని వారిపై చర్యలు తప్పవని తెలిపారు.

మెరుగైన వైద్య సేవల కోసం టీహబ్

● పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ● ఉట్నూర్‌లో రూ.95 లక్షల వ్యయంతో టీహబ్ కేంద్రం ఏర్పాటు ● పాల్గొన్న ఎమ్మెల్యే బొజ్జు


మాట్లాడుతున్న మంత్రి సీతక్క


ఉట్నూర్‌లోని టీహబ్ రక్త పరీక్షల కేంద్రం

ఉట్నూర్, ఫిబ్రవరి 12: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజలకోసం టీ హాబ్ రక్త పరీక్ష కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి సమీపంలో రూ.95 లక్షలతో నిర్మించిన టీ హాబ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు సక్రమంగా రక్త పరీక్షలు నిర్వహించి వారి అనారోగ్య లక్షణాలను నిర్ధారించి కావాల్సిన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇన్‌చార్జీ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాథోడ్‌నరేందర్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుంర బాలు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జాదవ్‌ఉపేందర్, రీజినల్ మెడికల్ ఆఫీసర్‌జాదవ్ మహేందర్, ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, జడ్పీటీసీ రాథోడ్ చారులత, తదితరులు పాల్గొన్నారు.

● **ఎట్టకేలకుప్రారంభం**

ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం రక్త పరీక్షల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని రూ.95 లక్షలతో నిర్మించిన టీహబ్ కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గత యేడాది కాలం క్రితం నిర్మాణమైన టీహబ్ కేంద్రాన్ని ప్రారంభించడంలో యేడాదికాలంగా నిర్లక్ష్యం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీహబ్ ప్రారంభోత్సవానికి అంకురార్పణ చేసింది. జిల్లా ఇన్‌చార్జీ మంత్రిగా నియామకమైన సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుల ఆధ్వర్యంలో టీహబ్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆదేశించడంతో పక్షం రోజుల క్రితం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆర్వీకర్ణన్ పర్యటించి భవన నిర్మాణం పూర్తయినప్పటికి పరికరాలు రాకపోవడంతో యుద్ధప్రాతిపదికన పరికరాలు ఏర్పాటు చేయించడంతో పాటు కావాల్సిన సిబ్బందిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వెంటనే నియమించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. దీంతో ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు హర్షిస్తున్నారు.

● **'సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ'**

ఉట్నూర్: మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి సీతక్క హామీ ఇచ్చారని సంఘం రాష్ట్ర కార్యదర్శి బొంకంటి సుభాష్ తెలిపారు. గత నాలుగు రోజులుగా జీతాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ నిరసన కార్యక్రమాలు చేపడుతుందని జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు వివరించామని తెలిపారు. దళారీ వ్యవస్థ తీసేసి ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇవ్వాలని కోరామన్నారు. అధికారులతో మాట్లాడి జీతాలు వేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు వివరించారు. ఇందులో మహేశ్‌రెడ్డి, అశ్విని, వీణా, సూర్యబంగారాం, అమర్‌సింగ్, బానుప్రసాద్, వెంకటేశ్, ప్రతాప్, గంగాధర్, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు: జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కను సోమవారం కేస్లాపూర్‌లో నాగోబా జాతర సందర్భంగా నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణంలక్ష్మి రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బొల్లారం బాబన్న, మాజీ సింగిల్‌విండో చైర్మన్ ప్రకాష్‌రావు, కజ్జర్ల పోశెట్టి మర్యాద పూర్వకంగా కలిశారు. మండలానికి రావాలని కోరడం జరిగిందని వారు పేర్కొన్నారు.


పెండల్‌వాడలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

జిల్లాలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం పర్యటన

● పెన్‌గంగా ముంపు గ్రామాల ప్రజలకు అవగాహన
● వరదలకు అప్రమత్తంగా ఉండాలి : సభ్యులు

జైనథ్, ఫిబ్రవరి 12: జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని కామాయి, పెండల్‌వాడ, సాంగ్వి పెన్‌గంగా వరద ముంపు గ్రామాల్లో పదవ బీఎన్ఎన్ డీఆర్ఎఫ్ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పెన్‌గంగానది వరద ముంపు గురయ్యే గ్రామాల ప్రజలకు పలు సలహాలు సూచనలు అందజేశారు. అంతేకాకుండా వరదలకు తటుకొని ఎలా బయట పడాలి, వరద ముంపునకు గురైన వ్యక్తులను ఎలా రక్షించాలి, పలు అంశాలపై సలహాలు సూచనలు అందజేశారు. దీంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం వెంబడి ఉన్న జిల్లా క్రీడల అధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్యాంసుందర్‌లు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి.గజానన్‌రావ్‌లతో పాటు అగ్నిమాపక, రెవెన్యూ శాఖ అధికారులు, సాంగ్వి సర్పంచ్ టి.విఠల్‌రెడ్డి, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


సాంగ్విలో పెన్‌గంగా తీరాన్ని పరిశీలిస్తూ..